చిన్నారులందరికీ

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

అల్బెండజోల్ మాత్రలు వేయించండి

నూలి పురుగుల నివారణ దినోత్సవ కరపత్రాలు, గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, అధికారులు

- బీసీజీ వ్యాక్సిన్‌కు ఇంటింటి సర్వే నిర్వహించాలి
- ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి
- అధికారులకు పలు సూచనలు చేసిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో కరపత్రాలు, గోడప్రతుల ఆవిష్కరణ

రంగారెడ్డి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఈ నెల 20న తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో కరపత్రాలు, గోడప్రతులను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు వారు లోనవుతారన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఏటా రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఏమైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి జూన్ 27వ తేదీన అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8 లక్షల 9 వేల మంది పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడానికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1,774 మంది ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయించేలా అవగాహన కలిగించాలని, గ్రామాల్లో టాం టాం ద్వారా తెలియ చెప్పాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వంద శాతం పిల్లలకు టాబ్లెట్స్ వేసేలా కార్యాచరణ ఉండాలని, ఆ రోజు పిల్లలు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నం తిన్న తర్వాత ఒకటి నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్ పొడి చేసి, 2 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ పొడి చేసి 3 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర నమిలి మింగే విధంగా వేయాలని సూచించారు.

పిల్లలకు మాత్ర వేయగానే తాగేందుకు తగిన తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అన్ని జాగ్రత్తలు తీసుకొని వంద శాతం ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం నూటికి నూరు శాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్యాశాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

బీసీజీ వ్యాక్సిన్‌కు ఇంటింటి సర్వే..

క్షయ వ్యాధిని నివారించేందుకు వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్ వేయడానికి ఇంటింటి సర్వే నిర్వహించాలని వైద్య అధికారులను అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. 18 సంవత్సరాల వయసు పైబడిన వ్యక్తులకు, 60 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులకు, పొగ తాగే వారికీ, టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వారికి, గత ఐదు సంవత్సరాల్లో టీబీ వ్యాధి సోకిన చరిత్ర కలిగిన వారికి బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వవచ్చని తెలిపారు. 18 సంవత్సరాల వయసుకు తక్కువ ఉన్న వ్యక్తులకు, కాన్సర్ ఉన్న వ్యక్తులకు, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి, గర్భిణి లేదా బాలింతలకు, గత 3 నెలల కాలంలో రక్త మార్పిడి చేసిన వ్యక్తులకు, అనారోగ్యంతో ఉన్న వారికి బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, జిల్లా అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తున్న సీపీఐ నాయకులు

పేదలకు న్యాయం చేయండి

- గృహలక్ష్మిలో నిర్మాణానికి సహకరించండి
- కుంట్లూరు భూదాన్ భూమిలో పట్టాలివ్వండి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ నాయకుల వినతి

పెద్దఅంబర్‌పేట, జూన్ 19: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు లోని భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రాచారి, పాలమాకుల జంగయ్య, ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు తదితరులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కుంట్లూరు రెవెన్యూ పరిధి 215 నుంచి 224 సర్వేనంబర్ వరకు ఉన్న భూదాన్ భూమిలో 18 నెలలుగా దాదాపు 20 వేలమంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. పిల్లాపాపలు అరకొర వసతులతో అక్కడే ఉంటున్నారని, పక్కనున్న ప్రభుత్వ పాఠశాలకు వారి పిల్లలను పంపుతున్నారని చెప్పారు. కొందరు భూస్వాములు, రియల్ ఎస్టేట్ సంస్థలు ఈ భూదాన్ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నాయని, వారినుంచి భూమిని కాపాడి అర్హులైన నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. గృహలక్ష్మి పథకంలో ఇండ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ భూమికి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా సాయం అందించాలని కోరారు. తమ విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారని, రెవెన్యూ మంత్రి, అధికారులతో మాట్లాడి నివేదికను తెప్పించుకుంటానని చెప్పినట్టు తెలిపారు. అర్హులైన పేదలకు న్యాయం చేద్దామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 23న ధ్రువీకరణ పత్రాల పరిశీలన

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్

వికారాబాద్, జూన్ 19 : తెలంగాణ పాలీసెట్-2024లో అర్హత పొంది పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 25వ తేదీలలో తమ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హాజరుకావాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ముందుగా స్లాట్‌లను జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు రిజిస్టర్ చేసుకొని బుక్ చేసుకోవాలన్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, పాఠశాల బోనఫైడ్, టీసీ, తహసీల్దార్ చేత మంజూరు చేయబడిన కుల, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ తదితర పత్రాలతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. వికారాబాద్ జిల్లావాసులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

5వ తరగతి రెసిడెన్షియల్‌లో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం

వికారాబాద్,జూన్ 19 : వికారాబాద్ జిల్లాలో చదువుతున్న ఎస్సీ విద్యార్థినీవిద్యార్థుల కోసం 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలేబుల్ స్కీం కింద ఇంగ్లిష్ మీడియం 5వ తరగతి (రెసిడెన్షియల్)లో రెండో దఫా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్.మల్లేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5వ తరగతిలో (రెసిడెన్షియల్) (91) సీట్లకు గానూ మొదటి విడుతలో (23) సీట్లు భర్తీ అయిన తర్వాత మిగిలియున్న (68) సీట్లకు ఇదివరకు దరఖాస్తు చేసుకోని వారు అర్హులైన ఎస్సీ విద్యార్థినీవిద్యార్థులు జూన్ 26 వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నంబర్ (ఈ-10) నందు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మైనర్ బాలికను వేధించిన యువకుడికి జైలు శిక్ష

నిందితుడు బండి

మంచాల, జూన్ 19 : మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి ఎల్‌బీనగర్ 9వ అదనపు జడ్జీ, స్పెషల్ పోక్సో కోర్టు జడ్జీ 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు మంచాల ఎస్ఐ రవి నాయక్ బుధవారం తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా బాలిక కుటుంబానికి రూ. 2లక్షల నష్ట పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చినట్లు చెప్పారు. మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నోముల సమీపంలో ఉన్న ఆయిల్ మిల్లులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిండి (20) అదే మిల్లులో పని చేస్తున్న మైనర్ బాలికపై 2022 సంవత్సరంలో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు చెప్పారు.

సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి

అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సముజ్వల
- మైసిగండి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ అనీమియా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడ్తాల్, జూన్ 19 : వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు సమతుల్యమైన ఆహారాన్ని తీసుకుంటే రోగాలు దరి చేరవని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సముజ్వల అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో డీటీడీవో రామేశ్వరి, ఏటీడీవో వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్రపంచ అనీమియా దినోత్సవంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, జడ్పీటీసీ దశరథ్‌నాయక్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనీమియా వ్యాధిని నివారించడానికి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. రక్తహీనత కారణంగా గిరిజన జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనీమియా వ్యాధి రక్తంలోని హిమోగ్లోబిన్ శాతాన్ని తగ్గించడమే కాకుండా జన్యుపరంగా వచ్చే అనేక రోగాలకు దారితీస్తున్నదన్నారు. అనీమియా వ్యాధికి గల కారణాలను, నివారించే మార్గాలను, పాటించాల్సిన ఆరోగ్య నియమాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు వివరించారు. దేశంలో 2047 నాటికి అనీమియా వ్యాధిని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని ఆయన తెలిపారు. గిరిజన తండాల్లో అనీమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులకు సహకరిస్తామని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి గీత, వైద్యుడు కిరణ్, హెచ్‌డబ్ల్యూవోలు బాలరాజు, రాములు, ఉపాధ్యాయ బృందం, ఏఎన్ ఏంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరిస్తా..

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

పెద్దేముల్, జూన్ 19 : కోట్‌పల్లి మార్కెట్ నూతన కమిటీ పాలకమండలి చైర్మన్ గడ్డకింది అంజయ్య, వైస్ చైర్మన్ ఎస్.నారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు పలువురు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో రాష్ట్ర శాసన సభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కోట్‌పల్లి మార్కెట్ కమిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు పాలకమండలి సభ్యులు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని, తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కోట్‌పల్లి మార్కెట్ పరిధిలోని రైతులందరికీ న్యాయం చేసేలా కృషి చేస్తానన్నారు. అనంతరం పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో చైర్మన్ గడ్డకింది అంజయ్య, వైస్ చైర్మన్ ఎస్.నారాయణరెడ్డి, డైరెక్టర్లు హరిసూదన్ రెడ్డి, ఎండీ.ఇక్బాల్, ముడావత్ రాంశెట్టి, అక్బర్, నాయకులు బందెయ్య, టీ నర్సింహులు, రమేశ్, రియాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జీతో

విచారణ జరిపించాలి

పేపర్ లీకేజీపై నరేంద్రమోడీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 19 : దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి నిందితులపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత్ర్య యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఎందుకు పేపర్ లీకేజీలు అవుతున్నాయని ప్రశ్నించారు. పరీక్ష కన్నా ముందే పేపర్ల లీకేజీ అవుతుంటే బొమ్మలాట ఆడుతున్నట్లుగా వ్యవహరించే తీరు సరైన పద్ధతి కాదని విమర్శించారు.

దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేసి మాయల ఫకీర్ మాటలు చెబుతూ పూట గడపాలని చూస్తుండడం సరికాదన్నారు. ఇప్పటికైనా నీట్ పరీక్షను రద్దు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జగన్, శంకర్, జంగయ్య, శివశంకర్, రాఘవేందర్, పవన్, సురేశ్, మహేశ్, జగన్, ప్రవీణ్, రాజశేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్

ఆదివాసీలకు ఆరోగ్య భద్రత కల్పిస్తాం

- చైతన్య నగర్‌లో ఘనంగా ప్రపంచ సికిల్ సెల్ అనీమియా అవగాహన దినోత్సవం
- గ్రామ ప్రజలకు ప్రపంచ సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు,ర్యాలీ నిర్వహణ
- వ్యాధి లక్షణాలు, సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన
- అవగాహన సదస్సులో పాల్గొన్న వికారాబాద్ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి మల్లేశం

పెద్దేముల్, జూన్ 19 : ఆదివాసీ గిరిజన ప్రజల జీవితాల నుంచి సికిల్ సెల్ అనీమియా వ్యాధిని తరిమికొట్టి వారికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని వికారాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి మల్లేశం పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చైతన్య నగర్ గ్రామంలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా అవగాహన దినోత్సవంలో భాగంగా గ్రామస్తులకు వ్యాధి లక్షణాలు, సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలో సికిల్ సెల్ అనీమియాను నిర్మూలించాలనే లక్ష్యంతో వికారాబాద్ జిల్లాతోపాటు 13 జిల్లాల్లో సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతున్నదని, ఆదివాసీల జీవితాలకు సికిల్ సెల్ అనీమియా వ్యాధి నుంచి విముక్తి కలిగించి ఆరోగ్య భద్రత కల్పించాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి సాధారణంగా 6 నెలల వయస్సులో ప్రారంభమవుతుందని, ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి భిన్నమైన లక్షణాలతో ఉంటుందన్నారు.

ముఖ్యంగా లక్షణాల్లో రక్తహీనత/ దీర్ఘకాలిక కామెర్లు(జాండీస్) ఉండుట, కీళ్ల దగ్గర, చాతి దగ్గర, నడుము వద్ద తీవ్రమైన నొప్పులు, చేతులు, కాళ్లవాపు, తరచు ఇన్ఫెక్షన్లు, యుక్త వయస్సు లేదా పెరుగుదలలో జాప్యం, దృష్టి సమస్యలు అనీమియా లక్షణాలని పేర్కొన్నారు. వ్యాధి వల్ల స్ట్రోక్, తీవ్రమైన చాతినొప్పి, రక్తపోటు, అవయవ నష్టం, అంధత్వం, లెగ అల్సర్, పిత్తాశయ రాళ్లు, ప్రియాపిజం, డీప్ సిర రంధ్రం, గర్భధారణ సమస్యలు వస్తాయన్నారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి నివారణ కోసం నీటిని పుష్కలంగా తాగాలని, ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు హిమోగ్లోబిన్‌కు మేలు చేసే పండ్లను తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతోపాటు ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లను తీసుకోవాలన్నారు. ప్రజలు అనీమియా వ్యాధి సోకకుండా ఉండాలంటే స్మోక్(పొగ తాగటం), ప్రిస్క్రిప్షన్ లేని మందులు వాడటం, తీవ్రమైన వేడి లేదా చల్లని ఉష్ణోగ్రతలో బయటకు వెళ్లడం వంటివి చేయకూడదన్నారు. వ్యాధికి వివిధ రకాల మందులు వాడటంతో పాటు శస్త్ర చికిత్సలు, రక్తమార్పిడి, మూల కణాల మార్పిడి, జీవన శైలి మార్పు, స్వీయ సంరక్షణతో సికిల్ సెల్ అనీమియాను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా చైతన్య నగర్ గ్రామానికి చెందిన ప్రజలు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎప్పటికప్పుడు స్థానికంగా ఉన్న వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేశ్, డీపీహెచ్ఎన్ చండీశ్వరీ, మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు, ఐటీడీఏ సిబ్బంది వినోద్, హరికృష్ణ, ఎంపీవో రమేశ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, డాక్టర్ ప్రమోద్, ఏఎన్ఎం స్వప్న, ఆశ వర్కర్ కరీమా, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చైతన్య నగర్ గ్రామంలో అనీమియా అవగాహన దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న వికారాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి మల్లేశం తదితరులు